ఎముకలు

అల్లం రాజయ్య

1978 డిసెంబర్ ఆఖరు వారం....

బారెడు పొద్దెక్కింది ఎండ పొడ గుడిసెల మీద, గూనిళ్ళ మీద సమంగానే పడుతున్నది. గుడిసెల కొప్పుల్లోనుండి పొగ నీరసంగా పైకి లేస్తున్నది. పశులు గుంపులు గుంపులుగా ఎగురుతూ అడివికేసి వెళుతున్నాయి వరికోతల రోజులేమో! రోకలి పోట్ల చప్పుడు- ధాన్యం తపుకు తపుకన చెరిగిన చప్పుడు వినిపిస్తున్నాయి... ఊరు ఊరంతా ఎవరి పనుల వాళ్ళే చేసుకుంటూ సందడిగా ఉన్నది. ఊరికి దూరంగా విసిరేసినట్లున్న మాదిగ్గూడెం బయటకొచ్చి ఒక మనిషి కళ్ళకు చెయ్యడ్డం పెట్టుకొని ఊరుకేసి చూశాడు. అతనికి ఊరు నూరు మైళ్ళ దూరమున్నట్టుగా తోచింది. బరబర తల గోక్కొని తుపుక్కున ఉమ్మి ఊరువైపు కదిలాడు....

ఆ మనిషి ఎలాగున్నాడయ్యా అంటే— పీక్కుపోయిన చెంపల మీద వికృతంగా పెరిగిన గడ్డం—ఎండిపోయిన గుంటకళ్ళు— మసుగులో గారె కలిపితే తేలిన మొయ్య చేప పిల్లలాగ కనుగుడ్లు—పుల్లల్లాంటి కాళ్ళు ఆ కాళ్ళు కలిసిన చోటును కప్పేస్తూ చిన్న గుడ్డపేగు-ఒళ్ళు ఎముకల గూడు-మసిక లేసిన పాతగుడ్డలాగ చర్మం-ఆ చర్మంకూడా కమిలిపోయి ఎముకలకు ఇగ్గి కట్టినట్టున్నది- రెండు చేతివేళ్ళ మధ్య గోకుడు నపిమీరు పుళ్ళుపడి ఉన్నాయి—కాళ్ళ మడిమెలు ఎండకాలం నెర్రిడిసిన లో చెరువులాగున్నాయి. కుడి మోకాలు చిప్పకు పాత గుడ్డొకటి చుట్టబడి ఉన్నది. ఇంకా చెప్పాలంటే మనిషి వానకు తడిసి ఎండకు గుంజుకొచ్చిన పాత చెప్పులా ఉన్నాడు...

మనిషిని చూసి వయసు చెప్పాలంటే డెబ్బయేండ్ల ముసిలోని లాగున్నాడు. నెత్తిమీది వెంట్రుకలు చూస్తే రాగిరంగు దిరిగున్నాయి .. నిజానికి అతని వయసు 45 దాటుండదు అతని తల్లిదండ్రులు ఏం పేరు బెట్టారో ఎవరికి తెలియదు. లేగలకాసే వయసప్పుడు మిగతా అవయవాలు కనిపించకుండ కాగంత బొత్త ఉండేది. కనుక అతన్ని ఆ ఊరివాళ్ళు బొత్తోడు అని పిలుచుకున్నారు. ఆ పేరే స్థిరపడి పోయింది.

బొత్తోడు ఊరు సొరుదల కొచ్చాడు. కాళ్ళు పట్టుదప్పిపోయి ఊగులాడుతున్నట్లుగా నేలమీద పడుతున్నాయి. ..అంత దూరం నడిచినందుకే మనిషి ఎండలో తరుముకు రాబడ్డ దున్నపోతులాగ అఖర్ గొడుతున్నాడు. మరింక నడవలేక తంగేడు చెట్టుకింద కూలబడి పోయాడు.

"అంతు జెరమవ్వను కుక్కల్ .... సెత్తకుప్పకు దెబ్బెగదా! మరింక కోలుకునే దవద్దం... ఒంట్లో నెత్తురు సచ్చింది.... జీవ సచ్చింది... సీకిన బొక్కయిపాయె తనువు మరింక రొండొద్దులైతే సెత్తే సచ్చె

టట్టున్నది " బోత్తొని తప్పకళ్ళల్లో లాడాడు, కాళ్ళు కదలడం లేదు
భయం మరింక ముందుకు ఆలోచించ ఆ దారి వెంట ఎవరైనా వస్తారేమో
కూడదనుకున్నాడు తేవడానికి పెనుగు తేపి నిలబెట్టగలరనుకొని ఆకాశ నుండి ఈ

కొసదాకా పారచూశాడు. కనుచూపు మేరలో ఎవరూ కన్పించలేదు. కుక్కొకటి నాలుక ఊగులాడుతు దగా మాదిగగూడెం నుండి ఊరిలోకి ఉరికేది ఆగి తంగేడు చెట్టును బొత్తాన్ని మురికిచూసి కాలెత్తి తంగేడు చెట్టుమీద ఉచ్చ బోసింది.

"నీ తల్లి దీనికి సుత నేను మనిషి తీర్గ గన్పడ్తలేను ...మన్నయిపోయింది సెత్త. రాయయిపోయింది పొల్ల గండ్లు....అ-గ్గానె-పు-పొల్ల-గండ్లు" అనుకుంటూ శక్తినంతా కూడదీసుకుని లేచి నిలబడాలనుకున్నాడు. తంగేడు కొమ్మ తెగిపోయింది. మళ్ళీ కూలబడి పోయాడు.

ఎటూ చేతకాక దుమ్ములో కుడిచేత కెలికిండు—ఏదో పాగొట్టు కున్నోనిలాగా—తప్పకళ్ళ నుంచి రాలినకన్నీళ్లు దుమ్ములో ఇంకిపోయాయి....

ఎవరివో అడుగుల చప్పుడు—తలెత్తి చూశాడు. ఎదురుగా జోగు బానక్క నిలబడున్నది....

"ఏందిరన్న గీడ కూలబడినవ్...." బానక్క బొంగురు గొంతుతో కుడిచేతిలోని త్రిశూలం గంట ఊపుతూ అడిగింది.

బానక్క నుదుటిమీద ఎర్రగా రూపాయంత కుంకుంబొట్టు—నూనె కారే జిడ్డు ముఖం—జెడలు గట్టిన గంపంత సిఖ చూసుకుంటూ బొత్తాడు చప్పుడు చేయలేదు....

"సీకేసిన బొక్కయి పోతివిర అన్నగ-పోశవ్వతల్లి సిన్నది గాదుసుమా? పిల్లో పిసుకో మొక్కు—నా తండ్రి రాయేశుని బెల్లం బంచి పెడ్తనని మొక్కకపోతివి-పెద్దవ్వ తల్లికి...." బానక్క చెప్పక పోతున్నది.

"బానవ్వ నన్ను గింతంత లేవట్టి నిలుసుండ బెట్టె—గీసదనక్క సత్తె వడ్తచ్చిన-గీడి కచ్చినంక నా తరంగాలే ......కూలబడి పోయి" బొత్తాడు.

బానక్క రెండు జుబ్బల క్రింద చేతులేసి నిలసుండ బెట్టింది. .మనిషి ఊగిపోయాడు.

"పెయ్యిసూడు నీల్లకుండ తీర్గ సల్లబడిపోయింది-మల్ల అనుకచ్చెటట్టున్నది. మంచాల పడుండక ఏడికి బోతనన్నవ్ సావ—"

"బానవ్వ నేను మల్లమనుషుల్ల గలుత్తానే... ?"

"ఏవున్నదిరా నీ సెత్తల? పోశవ్వ సప్పరిచ్చేసింది... మట్టి సెత్తకుప్ప కష్టెముల్ల కోలుకుంటాది?"

"గంతే నంటావే?"

"అంత భగవంతుని దయిరన్న! గంపంత కన్నుబెట్టుకొని ఏడున్నడో నా తండ్రి—" బానక్క గుడ్లు తిప్పి ఆకాశం వేపు త్రిశూలమెత్తి మొక్కి "ఔనుగని—గిప్పుడేడికి బోతున్నవ్....?" జోలె భుజం మీదికి ఎగదోసుకుంటూ, అడిగింది.

"నీ బాంచెన్ బానవ్వ! పదియేనొద్దులాయె-మంచాలబడి-రెక్కాడ్తనే డొక్కాడె బతుకులాయె-ఒక్కటి మీ అదినె కొట్టి పోసుకుంటే పోర గండ్లకే సాల్తలేదు. పటేలింటికి బొయ్యి ముంజీత మన్న తెత్తామని బోతున్న"

"నువ్వా! నడుమిరిగిన ముసిల్ది తాడిసెట్టెక్కుత నన్నట్టున్నది కత-నడసుడే ఒమ్మ కట్ట మయితంది—మరింక జీతం మోసుకత్తావ్...."

బొత్తాడు జవాబు చెప్పకుండా అడుగు లేస్తున్నాడు... తూలుకుంటూ నడుస్తున్న బొత్తాన్ని ఆశ్చర్యపడి చూసి, "కడుపు కగిదల్ల పాపిట్టిది....భగమంతుడా ఏం జల్మమిత్తివి నా తండ్రి! నడీడు ఒడక ముందె మనిషి బొగ్గయి పోయిండు గదా! ఎప్పుడో రాలిపోతడు ..." బానక్క త్రిశూలం గంట విషాదంగా మోగుతుండగా ముందుకు నడిచింది.

బొత్తాడు ఊరుచొచ్చే సరికి మళ్ళీ కాళ్లలో సత్తువ సన్నగిల్లింది. ఏది ఏమైనా కూలబడితే మళ్ళీ లేవడం కష్టమని దారి కటుఖ్యిటూ నాటున్న ఒక పక్క దడిని పట్టుకొని నిలబడిపోయాడు.

అదే దారివెంట కాసేపటికి షావుకారు



మల్లేశం ధోవతి చెంగులు తన్నుకుంటూ వచ్చాడు-దిగజారిన చెంపల్లో చీమ కళ్ళ లాగున్న చిన్న కళ్ళు టపటప లాడించి "ఎవనివిరో? బొత్తాంవా! ఎంకయ్య పటేలు పెద్ద పాలేరోడు దల్ల పొంట పాకులాడ్తం డేందికత?" అన్నాడు కాగంత కడుపు కిందికీ మీదికి ఊగుతుండగా పళ్ళు బెకబెకలాడినట్లు నవ్వుతూ....

"నీ బాంచెన్ అంతుజెరం గొట్టి గిట్లయి పోయిన" బొత్తాడు.

"కొట్టదామరి ..మాదుగులు బొత్తిలకు బేనిదార్లయి పోతిరి- కాలంగా ....కాలం బొత్తింకు సెడి పోయింది....మాదుగులకు మదమెక్కి పోయింది. సింత పండు కీర్గు వోళ్లు మిరుపకాయల తీర్గ మెర మెర లాడవట్టిరి సిన్న పెద్ద అంటారు లేకుండయి పోయింది... ఓ నీ యవ్వల.... సంఘాలు పెంగ అని పింగబింగ డబట్టిరి... పోశమ్మను గొలువ నిచ్చేరా? మైసమ్మకు మొక్కనిచ్చేరా? లంజ కొడుకలారా! సావుండ్లి-ఇగో నేను ఖరాఖండిగ సెప్పుతన్న మల్ల ఎనుకటి గత్తరచ్చి ఊకున్నక పోక పోతె నా పేరింకోటి బెట్టు-" మళ్ళీ అసహ్యంగా-ముతక బనీను లోపల ఎత్తు పొట్ట కిందికి మీదికి కదలగా నవ్వాడు.

"గొడ్డుకు పుండా-గద్దకు ఇందాట" అందామనుకున్నాడు బొత్తాడు. అది కూడా అనడానికి ఓపిక లేక ఊకున్నాడు.

"బాగని....నాబాకి గొట్టి సత్తమను కుంటన్నవ-వారీ! కోమటోని బాకిల బడి పోతే నరకంల నూనె కడయిలేత్తరు జేగర్త" హెచ్చరించాడు.

నూనె మరకలతో నల్లగా మాగిన అంచె నెత్తుకొని బరిబాత పిల్లవాడు ఒకడు వచ్చి అంచె కిందికుండే "ఎటుబోదాం సావుకారీ?" అడిగాడు.

మట్టి ముద్దకు పుల్లలు గుచ్చినట్లుగా ఉన్న పిల్లవాడి కాళ్ళు అంచె బరువుకు జవజవలాడుతున్నాయి.

"ఇంకేడ బోదాం కాపాలగడ్డకు-మాది గిడ్లకు సావు" అన్నాడు మల్లేశం.

కాళ్లు బలంగా పొడుస్తూ పిల్లవాడు ముందుకు నడిచాడు.

"ఏమాయెర బొత్తాడ-బెల్లంగొట్టిన రాయోలె పలుకవు పలుకవు. అరె బాకంటె బాకంటె - ఎల్లువాను లేకపోతే పెద్దా

నమ్మి కట్టాలె-ఏమనుకున్నవో?" మల్లేశం

బొత్తొడు ఆ మాటకు నోరు తెరవలేదు. వెనుక వేపు నుండి ఎవరో రావడం చూసి మల్లేశం కందు పండ్లు గిలకరిసి గొనుక్కుంటూ ఎవరో తరుముతున్నట్లుగా నడిచాడు...

వచ్చినవాడు ముత్తయ్య.... ముత్తయంటే రెండేండ్ల కింద పొరుగూరినుంచి ఈ వూరికి నమిలికొండ అంకూశనింటికి ఇల్లుట వచ్చిన ముత్తడు. ముత్తయ్య వచ్చిన ఆర్నెల్లకు అత్తమామ పాలికెక్కి గుడిసెమాత్రం అల్లునికి బిడ్డకు విడిచి పోయారు.... కలిగినోల్ల సేతల్ల సేక యిలిసేసి బతికిండు ...తొలుత ముత్తయ్యను చూసినప్పుడే మెదడు తిరిగిపోయిందనుకున్నారు జనం. ఎప్పుడు ఆసు బోసినట్లు ఊరంత కలె తిరిగేటోడు. కనిపించిన వాల్ల నల్ల కష్టంసుఖం అరుసుకునేటోడు.... మెదడు తిరిగిపోయినవాడు నిరుటి నుంచి పదాలు కూడ పాడసాగిండు. ఆ పాటలు జనాలకు చిత్రంగా కొత్తగా, మాట్లోనియో, చిందోనియో, బుడుగు జంగమోనియో కాకుండా ఉన్నా పలుశారుగానే ఉన్నాయి.... ఊరిలోకి కొత్త మనుషులు రావటం జరిగింది... వాళ్ళు సుట్టాల"ని చెప్పేవాడు. సుట్టాలకు ముత్తనిలాగే మెదడు తిరిగినట్టున్నది.... వచ్చిన చుట్టాలు వచ్చినట్టుండక కూలోల్లందరిని కుప్పేసి పదాలుపాడి-కతలు చెప్పి కొంత కట్ట మీదికి తెచ్చారు. ఊళ్ళున్న కలిగినోళ్ళు కళ్ళు తెరిచేటాల్లకే ముత్తడు ముత్తయ్యాయి పోవడమేకాదు. లేనోల్ల నోట్లె నాలికయి పోయాడు. కలిగినోల్లు గుజులు కట్టేసరికే — లేనోల్లు సంఘం పెట్టారు. ముత్తయ్య సంఘం పెద్దయ్యిందు...గప్ చిప్‌గ ముత్తయ్యను మట్టికింద గప్పాలని కలిగినోల్లు ఓ రాత్రి పూట ముత్తయ్య ఇంటి మీదపడి నెత్తురు ముద్దయ్యేదాక కొట్టి కోలాటమేసి-గుడిసె కగ్గి పెట్టిండ్లు-సమయానికి గూడెపోల్లంత కుప్పకూడి ముత్తయను బతికించుకున్నారు. కాని పొద్దులతోనున్న ముత్తయ్య పెళ్ళాం నెమిలికొండ కర్రెల్లి గుడిసెలోపలే కాలి బూడిదై పోయింది, బతికిన ముత్తయ్య కుడిచెయ్యి విరిగి పోయింది.

తరువాత చానా జరిగి పోయాయి. కూలోల్ల కూలిలెక్కినయ్. పాలేరోల్ల జీతాలెక్కినయ్. ఉన్నోల్లు "గతిలేని లంజ కొడుకుల కండ్లు నెత్తికెక్కిన"యనుకున్నారు.

"బొత్తయ్యబావా! ఏందే గట్లనికి పోతున్నవ్? ఎట్లయి పోయినవు మనిషివి?" ముత్తయ్య....

"ముత్తయ్యబావా జెరసచ్చి నీకడుపున బుడుక-నన్ను ఆసరబట్టి జెర ఎంకయ్య పటేలింటి కాడ ఇడిసి పెట్రావ్...." బొత్తయ్య నూతిలో నుంచి మాట్లాడినట్లుగా అడిగాడు.

"దా...పోదాం ...ఏం పనోంట? నిన్ను సూత్తె కండ్లకు నెత్తురొత్తంది. ఎట్లయి పోయినవ్? నీ నెత్తల నెత్తురు ఎంకయ్య పటేలు బూములు దాగినయి. నీ మాంసం అని బొంగాలకు ఎరువైంది—నీ నెత్తురు మాసంతోని పండిన పంటంత ఆకుదిని బలిసి పోయిండు-అంటేందన్న మాట నిన్ను ఎంకయ్య పటేల్ కోడి బొక్క తీర్గ సీకి పారేసిండు" ముత్తయ్య బొత్తయ్యను భుజాని కానించుకోని ఇట్లా చెప్పుకుంటూ తీసుకొచ్చాడు.

బొత్తయ్యకు ఈ మాటలు చెవికెక్కడం లేదు ఒక్కొక్క ఇల్లు దాటుకుంటూ పోతుంటే వెంకయ్య పెద్దరువాజ "ఎప్పుడత్తదా?" అని చూస్తూన్నాడు. లోపల మాటలు పేర్చుకుంటున్నాడు, అడుగబోయె ము జీతం గురించి ఆశలు పేర్చుకుంటూ....

వెంకయ్య పెద్దరువాజ తెరిచున్నది. "ఇగనేం బొత్త పనున్నది." ముత్తయ్య వెనుదిరిగి ఏదో గొనుక్కుంటూ మొండి

చెయ్యి ఊపుకుంటూ వెళ్ళిపోయారు.

బొత్తాడు కాళ్లు నిలదొక్కుకొని పెద్ద దర్వాజ లోపలికి నడిచాడు. లోపల వాకిట్లో పిల్లల కోడొకటి కొక్కు కొక్కు మనుకుంటూ మట్టిగీరుతోంది. మనుషుల అలికిడేమిలేదు. పడారి గోడకు అరిగిపోయిన నాగళ్ళు ఒక పాతజంబు నిలబెట్టున్నాయి. నాగళ్ళ పక్క కూలబడి పోయాడు— ధాన్యపు యిల్లు అరుగమీద గొనెపట్టా కుర్చీని పులుకు పులుకున చూడ సాగాడు.

చాలా సేపటిదాక ఎవరూ రాలేదు. ఆ తరువాత భూతంకూసడు ఒరిపిచ్చిన కొడవళ్లు భుజం మీదేసుకొని బయట కొచ్చాడు.

"అంకూశన్నా పటేలింట్లున్నడా?"

"ఎవలూ బొత్తన్నా! పనికత్తలేవేమె! అంటు జెర తాకిందని మనోల్లనుకోంగ ఇన్న- సూసత్తా మనకుంటే తీరకేడిది కోశల దేవుసంగుత్తా మంచె తీర్తలేదు. ఔనుగని...." అంకూశడు బెదిరి బెదిరి వెనుక చూశాడు. మిడతగుడ్లు విచిత్రంగా తిప్పి — బండ పెదిమలు ఒడిమి పట్టి ఏదో చెప్పాలనట్టుగా చూసి-ఏమనుకున్నాడో... "పటేలు ఫలారం జేత్తుండట" అనేసి గబగబ వెళ్ళిపోయాడు....

బొత్తానికి కళ్ళు మసక బారినయ్. నోరెండుకపోయి పెదిమలు గిడసబారి పోయాయి. కడుపుల ఆకటి కట్టు లేచింది అరిపాదాలనుండి చల్లగా ఏదో పాకుతున్నట్టుగన్నది... పెదిమలు నాక్కున్నాడు.

మాగన్నుగా మొక్కి నాగలి కొరిగి కూర్చున్నాడు. ఆ మధ్యలో చాలా మంది వచ్చిపోయారు. అతనికి వచ్చినవారెవరో? పోయినవారెవరో తెలియనే లేదు. కాని ఆ అడుగుల చప్పుడు మాత్రం ఎంకయ్య పటేల్‌ది గాదని మాత్రం తెలుసు. ఆ విధంగా ఎంతసేపు కూర్చున్నాడో!

"వారీ! బొత్తాడస చ్చినావురా?" అన్న గద్దింపుతో బొత్తాడు కళ్లు తెరిచాడు. ఎదురుగా పటేలమ్మ రాజమ్మ చెంగులు ఎత్తి పట్టుకొని గంపంతనోరు తెరిచి అడుగుతోంది.

బొత్తాడు పుల్లల్లాంటి చేతులెత్తి దండం బెట్టిండు "నీ బాంచెన్ గింతంత గంజుంటె బొయ్యిండ్లి. లాపోతె నిజ్జంగనే సచ్చిపోత"

"నిగబడ చ్చినవ అండి ఆర్సి తయారు బెట్టిన .. నీ పెండ్లాం మిండెడు దాస బెట్టిండా గంజి ..." రాజవ్వ తడకముక్క పోగు లెగురుతుండగా అరిచింది.

"ఏందే? ఏం సంగతి?" త్రేన్పుకుంటూ ఎంకయ్య పటేల్ కూ కేటి పాములాగా బయటకొచ్చాడు. ఆ సంగతేదో తెలియక ముందే బొత్తడు గొక్కున్నాడు .. కుడి చేతిలో ఈనెతీసిన పొగాకు కాడున్నది బొత్తాన్ని చూడకుండానే ధాన్యపింటి అరుగెక్కి "ఏగాన్నరా ...!" అనుకుంటూ కుర్చీ కిటుకిట లాడగ కూర్చున్నడు....

"పెద పాలేరు బొత్తాని గంజంట—లాపోతె సత్తడట' రాజవ్వ

అదేదో మామూలు సంగతన్నట్లు సెవుల సుట్టదీసి పొగాకు కాడ తుంచి సుట్టలో పెట్టి బనీను పక్కజేబులో నుంచి అగ్గిపెట్టె తీసి సుట్ట ముట్టించి దమ్ములాగి "ఇగో . నిన్నె....ఆనికి త గంజ గట్కేసి పొంబ్బ . ఆనితోని మాట్లాడాలె.." అన్నాడు. చుట్ట కొరుకుతునే మొస్తూ ...

నీ పెండ్లాం ఎవన్నెత్తుకొని పోయిందిర- ఇంటి మొఖాన తొంగన్న సూత్త లేదు"

బొత్తాడు ఏదో మాట్లాడాలను కొని నోరు తెరవాడు- బొత్తాడు ఏం మాట్లాడక ముందే రాజవ్వ లోపలికెళ్లి పోయింది.... సత్తిపోరి కడుముంతల గంజి గట్క కలపుకొని తెచ్చింది. బొత్తానికి ఎటూ తాగాలో మొదట తెలియలేదు. ఆకలి మీదున్నడేమో ఆత్రంగా దోసిలి పట్టాడు. పెరిగిన గడ్డం మీద, నెత్తిమీద చిల్లుతుండగా సత్తిపోరి ఎత్తిపోసింది. మొదటి బుక్క లోపలికి పోక దమ్ము కొచ్చింది. కళ్ళు వికృతంగా



పోడుచు కొచ్చాయి. సత్తిపోరి మనసు కలికలై పోయింది. బెదురుగా ఎంకయ్య వేపు చూసింది. ఎంకయ్య మరెటో చూస్తున్నాడు. సత్తిపోరి కొంచెంసేపాగి మళ్ళీ పోసింది .. ఈ సారి గంజి గొంతులకు దిగింది. నెత్తిమీద కొట్టు కొమ్మన్నట్టుగా సత్తిపోరి సైగ చేసింది... మొత్తానికి బొత్తోడు గంజి తాగి మూతి తుడుచుకున్నాడు.

ఈ సారి కాళ్ళల్లోకి సత్తువ వచ్చి 'ట్లనిపించి లేచి నిలబడ బోయాడు.

"ఆన్నే కూకో! నేనే పిలిపిత్తా మనుకున్న—బిడ్డా బొత్తోడా గంజి కడుపులకు జారిందా? ఇగో పొగాకు గావల్నా? సరే పొంగ తీసుకునేవు ... ...బిడ్డా! నీ ఈడు అరున్న కాన్నుంచి నేనెరుగుదును నువ్వు పని దొంగవుగాదు—లంగవుగాదు గందుకనే ముప్పయేండ్ల మంచి నా కొలువు లుంచుకున్న—నువ్వు నా పాలేర్లల్ల పెద్ద పాలేరు వైనవ్-నీ మీద నేడిసి పెట్టి ఇన్నొద్దులు నిర్రంధిగున్న దొంగ బుద్ధి లేదు" ఎంకయ్య కాండ్రిచ్చి ఉమ్మింసు....సుట్ట చేలో పట్టుకొని కొంచెంసేపు మాట్లాడలేదు.... బొత్తోని ముఖం చూడాలను కొని ఆ ప్రయత్నం విరమించి "నేను చెప్పచ్చేదేమంటే?... దునియ బేకారయి పోయింది. నీ ముంగటనే పాలేరోల్లంత ఏడొద్దులు పని బందు బెట్టిరి. సరే మెడకు బడ్డపాము కరువక మానదని జీతాలెక్కెచ్చినమ్.... మాకు పశతలుండద్దా? పదిపొద్దులాయె నువ్వు మంచాల బడ్డవ్. మనది మట్టిసెత్తే ఇయ్యల్లింట్ల రేపు మంట్లె-ఏమంటవు....నీ సెత్తల జీగి సచ్చింది. నాదేమొ బారెడ్లు, భారికే తాయె-పనుల దెవుసం నీ అంతుకు సుక్కల కొండన్ని అరుదినాల కింద మాట్లాడుకున్న....నా లెక్కన నువ్వు ఇద్దుం జొండ్లు బాకి దేలినవ్....నీ అరబిగెడు సెలుక లెక్కగట్టు కొంగ ఇన్నారు రూపాలు యియ్య దేలినవ్—మొన్న గాడి ఒర్రెను దెచ్చిన గదాన్ని ఏరే మేపియ్యాలన కొన్న-మీ రాయేశన్ని రేఃటి నుంచి పనికిదోలు-" ఎంకయ్య మళ్ళీ కాండ్రకిచ్చి ఊంచిండు.

"అదిగాడు పశేలా! 'నేను పెరిగింది

తమరి దగ్గర్నే—నా కాశ్రెక్కలు కప్పకచ్చినయ్. తమరి అరువం దగ్గర్నే గింత జీవాత్తనొదులుత." బొత్తొని గొంతు తీరబోయింది....

"గిప్పుడేమున్నది? అంతలావు కావాల్నంటె మల్లగలువు—మైసమ్మ మిట్టకొత బట్టిండ్లు—కొత్తకాడికి బోవాలె-సత్తీ జెర అంగందుకోయే...." ఇంట్లోకి కేకేశాడు.

సత్తిపోరి అంగీ, చెప్పులు తెచ్చింది. .. కిర్రుచెప్పులు చప్పుడు చేస్తుండగా ఎంకయ్య పటేల్ వెళ్లిపోయాడు..

బొత్తొని కళ్ళవెంట నీళ్ళు కారినయ్.. తను పాలేరుగా ఆ ఇంట్లో దిలినరోజులు జ్ఞాపకానికొచ్చాయి.... ఎందుచేతనో పెదిమలు వణికాయి.... గతంలో రాత్రి పగలు తనుపడ్డ కష్టం గుర్తుకొచ్చి కళ్లు ఎరుపెక్కాయి.... బిగుసుకపోయి చాలాసేపు అట్లాగే కూర్చున్నాడు, అరిగిపోయిన నాగలిలాగా....రేపో మాపో అరిగిపోయిన నాగలి ఊడదీసి చెక్కలేసి పొయ్యిలో పెడ్తారు.... తను ఇయ్యాల్లనే పొయిల పెట్టబడ్డాడు.... చివరకు పిడికెడు బూడిదిగా మారి పోతాడు....

బొత్తొడు లేచి నిలబడి పెద్దరువాజ దాటి వెనుకకు తిరిగి చూశాడు. ఆరేండ్ల ఈడప్పుడు ఇదే గడపలకు తనయ్య దీసుకచ్చిండు. అప్పటి నుంచి పనిజేస్తెనే బాగుపడ్తనని ఒళ్ళు దాసుకోకుంట పనిజేసిండు. ఇయ్యాల్ల ఒంట్లె నెత్తురు తాగేసి గడపవతలికి ఇసిరేసిండు. ఎటుపోవాల్నో అర్థంగాక పడారి గోడ నీడన గువ్వ పిట్టలాగా కూర్చున్నాడు. ఆ దారివెంట ఎందరో పోతున్నారు పనులమీద - "రేపు ఆళ్ళ ఒంట్లె నెత్తు రోడిసినంక నా తీర్గనే కప్ప కూలిపోతరు, గీ బజార్లు, పడారి గోడలు ఎందరి నెత్తురు తాగినయో? గబూములు ఎందరి మాసం తిన్నయో?" ముత్తయ్య మాటలు హోరెత్తుతున్నాయి....

చాలాసేపు అట్లా కూర్చుండి చివరకు దేవుడు పూనినవానిలాగ లేచి నిలబడి కాండ్రకిచ్చి పెద్దరువాజ తలుపుల మీద ఊంచి తూలుకుంటూ మాదిగి గూడానికి నడిచాడు.

అట్లా నడిచినవాడు సీదా సంఘం గుడిసె - అంటే ముత్తయ్య గుడిసె— ముత్తయ్య గుడిసె కాలిపోయిన తరువాత లేవోల్లంత గలసి గుడిసెనైతె వేశారుగాని దానికి పనుగడ పెట్టలేక పోయారు. లోపలికి నడిచిండు. లోపలంతా దుమ్ము కొట్లాడుతున్నది ఓ మూలకు కుక్కొకటి ముడుచుక పన్నది—కుక్క తప్ప అందులో మనుషు లెవరు లేరు. ఓ మూలకు నాలుగైదు చేకు కర్రలకు ఎర్ర జెండాలు కట్టబడి ఉన్నాయి పెద్ద పెద్ద అక్షరాలురాసిన కాయిత మొకటి దూలానికి తల అతికించబడి ఉన్నది.

బొత్తొడు నిట్టాడు కానుకొని కూర్చుండి బయటి ఎండను చూడసాగిండు, అతని మనసులో ఎన్నో పగలు రాత్రుల్లు, పంటలు పతులు, పశువులు, మనుషులు, పనులు మెదిలాయి... తన తండ్రి సావంగ ఇచ్చిపోయిన రెండెకరాల సెలుక మెదిలింది. తనిప్పుడు సెలుక కాదు కదా సెత్తకూడా భూమ్మీద ఉండకుండా అయిపోయాడు.

మొదట తన జాడకు తన కొడుకొస్తాడనుకున్నాడు. చివరకు పెళ్ళామన్నా వస్తుందేమో అనుకున్నాడు ఎవరు రాకుండానే ఎండపొద వెళ్లిపోయింది. చీకటి దిగిపోయింది. అప్పుడు ముత్తయ్య వచ్చాడు. చీకట్లో కూర్చున్న బొత్తొన్ని చూసి ఏదో గొణిగాడు.

బొత్తొడు హఠాత్తుగ ముత్తయ్యమీద పడిపోయి కడుపుల పేగులు బయటికొచ్చేలాగా ఏడ్చిండు. ఏడుస్తూనే సంగతి చెప్పిండు.

ముత్తయ్య కాసేపు ఎంకయ్యను తిట్టిపోసి "లేపడుగుదాం.... ఇదులుతరా! అదుఎద్దు-మన ఒతుకు కట్టంలబట్టి కట్టంల బెరిగిందే.... నువ్వు ఇంటికి పో...." తీసుకొచ్చిండు....